

అధికారం మాదే.. ఇక మమ్మల్ని ఎవరు అడుగుతారన్న ధైర్యమో... ప్రజలేగా మోసంచేస్తే ఏమవుతుందిలే.. అన్న బరితెగింపో.. తెలియదు కానీ... మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం పొదలకూరులో మాయగాళ్లు చేసిన ఫోర్జరీ వ్యవహారం సంచలనం రేపింది. లేఅవుట్లకు అనుమతులు తీసుకోకుండానే ఏకంగా డీటీడీసీ ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అప్రూవల్ తీసుకున్నట్లు చూపించారు. భూమికి కన్వర్షన్ చేయకుండానే ఆర్డీవో పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కన్వర్షన్ జరిగినట్లు ప్రచారం చేసుకున్నారు. వీటి ద్వారా ప్రజలను మోసంచేసి అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను విక్రయాలకు పెట్టి దోపిడీకి పాల్పడ్డారు. తాజాగా నుడా అధికారులు ఈ ఫోర్జరీ సంతకాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగు చూశాయి.

పొదలకూరులోని స్వర్ణ లేఅవుట్





- ఫోర్జరీ పత్రాలతో లేఅవుట్ల ఏర్పాటు
- ప్రజలను మోసం చేసి ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- కన్వర్షన్, అప్రూవల్ రెండూ ఫేకే...
- కాకాణి అనుచరులే కీలక సూత్రధారులు
- నుడా అధికారుల ఫిర్యాదుతో చర్యలు

మాజీ మంత్రి ఊళ్లో మాయగాళ్లు !

పొదలకూరు/నెల్లూరు, జూలై 5: ఈ ఫోర్జరీ వ్యవహారం వెనుక ఉన్నది పొదలకూరుకు చెందిన నాయకులేనన్న ప్రచారం జిల్లాలో సాగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు తెలియకుండా ఇలాంటివి జరగవు. అలాంటిది మాజీ మంత్రి కాకాణి స్వగ్రామంలో ఆయనకు తెలియకుండా ఇన్ని అక్రమాలు జరిగాయన్నది చర్చనీయాంశమైంది.

● ప్రజలను మోసగించి...

పొదలకూరు మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పట్టణం శివార్లలో స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లే అవుట్లు వేశారు. అటు పన్నులు కట్టకుండా ప్రభుత్వాన్ని, అనుమతుల్లేకుండా ఇటు ప్రజలను మోసం చేస్తున్నారు. పట్టణంలో గత రెండు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. లేఅవుట్ వేయడం నుంచి ఆ ప్రాంతాన్ని మెరక చేసేందుకు మట్టి తరలింపు వరకు అన్నీ కూడా మాజీ మంత్రి కాకాణి కనుసన్నల్లోనే జరిగాయనే విమర్శలు ఉన్నాయి. పొదలకూరులో నెల్లూరు ప్రధాన రహదారికి ఆనుకుని స్వర్ణా గార్డెన్స్ పేరుతో లే అవుట్ వేశారు. దీని విస్తీర్ణం 18.44 ఎకరాలు కాగా, ఈ భూమంతా అడంగల్లో వ్యవసాయ భూమిగానే ఉంది. ఈ లేఅవుట్ ఎత్తు పెంచేందుకు వెంకటాచలం మండలం కనుపూరు చెరువు నుంచి రాత్రింబవళ్లు టిప్పర్లతో మట్టి తరలించారు. ఇకపోతే ప్రభుత్వ అనుమతి ఉందన్న కారణం చూపి.. ప్లాట్ల ధరలను విపరీతంగా పెంచారు. ఒక్కో అంకణం రూ.లక్షన్నర వరకు విక్రయించారు. కొనుగోలుదారుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు.

● కన్వర్షన్, అప్రూవల్ రెండూ నకిలీలే..

మాజీ మంత్రి కాకాణి స్వగ్రామం తోడేరు పరిధిలోని సర్వే నెంబరు 329, 330/ఏతోపాటు పొదలకూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 174తో కలిపి మొత్తం 18.44 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. గతంలో వ్యవసాయ భూమి కాగా, మాజీ మంత్రి అనుచరులు, కొందరు వైసీపీ నాయకులు లేఅవుట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అధికారం ఉందనే ధీమాతో నుడా నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. స్వర్ణా గార్డెన్స్ పేరుతో రాళ్లు పాతారు. రోడ్లు వేయడంతో పాటు కాలువలు తవ్వారు. మొత్తంగా 207 ప్లాట్లు వేశారు. వీటికి నకిలీ డీటీసీపీ అనుమతి పత్రాలు సృష్టించారు. టీఎల్‌పీ నెంబరు 72/2022/జీతో అనుమతి ఇచ్చినట్లు డాక్యుమెంట్లను సిద్ధం చేశారు. వాటిపై డీటీసీపీ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, ఏడీఎంల సంతకాలను ఫోర్జరీ చేశారు. వాటిని చూపించి విక్రయాలు జరిపారు. ప్రస్తుతం ఆ లే అవుట్‌ను అధికారులు పరిశీలించడం, కేసు నమోదు చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

● కేసు నమోదు

పొదలకూరులోని స్వర్ణాగార్డెన్స్ లేఅవుట్ పత్రాలను పరిశీలించిన నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి అవన్నీ ఫేక్ అని నిర్ధారించుకున్నారు. పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీని కలిసి మరింత సమాచారం కూడా అందజేశారు. దీంతో పొదలకూరు పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో నుడా, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇలా మండలంలో మొత్తం 50 వరకు అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. ఆ లేఅవుట్లను కూడా పరిశీలిస్తే అవినీతి బాగోతాలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

అక్రమ లేఅవుట్లపై కమిటీ

- ఆక్రమణదారుల్లో గుబులు
- అయోమయంలో కొనుగోలుదారులు

నెల్లూరు (జడ్పీ), జూలై 5 : జిల్లాలోని నుడా పరిధిలో ఏర్పాటైన అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ శాఖామంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. నెల్లూరు, కడప జిల్లాల్లో లేఅవుట్లకు సంబంధించి ఎక్కువగా అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో వాటిని పరిశీలించేందుకు ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి కమిటీని మంత్రి ఏర్పాటు చేశారు.ఈవారంలో ఈ కమిటీ జిల్లాలో పర్యటించనుంది.

● ఆక్రమణదారుల ఆందోళన

జిల్లాలో సుమారు 70శాతంపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. ఈ వ్యవహారం దశాబ్దాల కాలంగా జరుగుతూ ఉంది. గత ప్రభుత్వంలో నెల్లూరులో అక్రమ లేఅవుట్ల వ్యవహారం విచ్చల విడిగా సాగింది.నుడా అనుమతులతో ఏర్పాటు చేయాల్సిన లేఅవుట్లను అక్రమంగా ఏర్పాటు చేశారు. అంతేకాక ప్రైవేట్ భూముల పక్కనున్న ప్రభుత్వ భూ ములను కలుపుకుని లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అధికారపార్టీ నేతల అండ ఉందన్న ధైర్యంతోనూ, భవిష్యత్తులో ఇబ్బందులు ఉండ వన్న ఆలోచనతో లేఅవుట్లను వేసు కుని రూ.కోట్లు ఆర్జించారు. కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణల వ్యవహారం వెలుగు లోకి వస్తే, తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆందోళన ఆక్రమణదారుల్లో నెలకొని ఉంది.

● కొనుగోలుదారుల అయోమయం

ఈ అక్రమాలు తెలియక అనేకమంది ఆయా లేఅవుట్లలో ప్లాట్ల ను కొనుగోలు చేసి గృహాలు కూడా నిర్మించుకున్నారు. దీంతో త్వర లో కమిటీ నిర్వహించనున్న పరిశీలనలో ఏమవుతుందోనన్న ఆం దోళన వారిలో నెలకొంది. ప్రభుత్వం వీరి పట్ల ఎలాంటి వైఖరి అవలంబిస్తుందో వేచిచూడాలి.

15 నుంచి పాసింజర్ రైళ్ల రద్దు

బిట్రగుంట, జూలై 5: మూడోలైన్ పనుల కారణంగా బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో నడిచే పాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దుచేస్తునట్లు రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడ డివిజనల్ పరిధిలోని విజయవాడ, గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైన్ పనుల కారణంగా విజయవాడ నుంచి గూడూరు వరకు నడిచే 07500 పాసింజరు రైలును ఈనెల 15వ తేదీ నుంచి 30 వరకు, అలాగే గూడూరు నుంచి విజయవాడ వెళ్లే 07458 పాసింజర్ రైలును 16వ తేదీ నుంచి 31 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తునట్లు తెలిపారు.

రీజియన్‌కు 110 కొత్త బస్సులు

ఉదయగిరి, జూలై 5: నెల్లూరు రీజియన్ లోని అన్ని డిపోలకు 110కొత్త బస్సులు మంజూరైనట్లు రీజినల్ మేనేజర్ జీ.విజయ రత్నం తెలిపారు. శుక్రవారం ఉదయగిరి డిపోను ఆయన తనిఖీ చేశారు. డిపోలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాలకు నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఉదయగిరి ప్రాంత ప్రయాణికులు ఈ సర్వీసులను ఆదరించాలన్నారు. నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులకు అవసరమైన సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భక్తుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలిగి సంస్థకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసులు, ఎంఎఫ్ హనుమాన్‌సింగ్, ఎస్‌టీఐ షేక్ బాషా, వెంటేశ్వర్లు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



డిపో గ్యారేజీలో తనిఖీ చేస్తున్న ఆర్ఎం

తెప్పపై త్రిశూలధారి వైభోగం

- తీర్థవాదికి పోటెత్తిన భక్తులు
- వైభవంగా అశ్వవాహనసేవ

సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



విడవలూరు, జూలై 5: మండలంలోని రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువన భక్తులు తీర్థవాది(సముద్రస్నానం) ఆచరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్రంలో మునుగుతూ ఆనంద డోలికల్లో తేలియాడారు. తీరం వెంబడి కబడ్డీ, ఖోఖో తదితర ఆటలు ఆడారు. అధిక సంఖ్యలో మహిళలు కూడా సముద్రస్నానం ఆచరించి సైకత శివలింగాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రాకతో రామతీర్థం వీధులన్నీ కిటకిటలాడాయి. కొనుగోలుదారులతో అంగళ్లు కళకళలాడాయి. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర తీరాన, ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు తాగు నీరు, పులిహోరా పొట్లాలు పంపిణీ చేశారు. పెన్నార్ హేచరీస్ అధినేత ఓబిలి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు పులిహోరా అందచేశారు.




తెప్పపై విహరిస్తున్న ఆది దంపతులు

● వైభవంగా తెప్పోత్సవం

శుక్రవారం రాత్రి రామలింగేశ్వరుడి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెప్పోత్సవానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ పూజారి పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం పొన్నపూడి రహదారిలో ఉన్న కోనేరులో తెప్పోత్స వాన్ని నిర్వహించారు. విద్యుత్‌దీపకాం తుల నడుమ ఆది దంపతులు కోనేరులో విహరించారు. అనంతరం స్వామివారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రామతీర్థం, పొన్నపూడిలకు చెందిన తంబి సుబ్బమ్మ, సుబ్బరామమ్మ, పొన్నపూడి గ్రామస్థులు వ్యవహరించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రామకృష్ణ, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తాతా రమేష్, కోడూరు శ్రీధర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం



ఆయన చెప్తేనే ఖాళీ చేస్తాం..!

- మాజీ మంత్రి అండతో మూడేళ్లుగా వైద్యశాఖ కార్యాలయం ఆక్రమణ
- జిల్లా వైద్యాధికారే సహకరించారంటూ విమర్శలు
- విద్యుత్ బిల్లులూ చెల్లింపు

నెల్లూరు(వైద్యం) జూలై 5: మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మమ్మల్ని ఇక్కడ ఉండమన్నారు... ఆయన ఖాళీ చేయమని చెప్తేనే ఖాళీ చేస్తాం....అని ఆక్రమణదారులు వైద్యఆరోగ్యశాఖ అధికారులకు తేల్చిచెప్పారు. ఎవరేమి చేసినా ఇక్కడ నుంచి కదలేది లేదంటూ వారు భీష్మించుకున్నారు. దీంతో చేసేది లేక వైద్యాధికారులు వెనుతిరుగుతున్నారు. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. నెల్లూరు నగరంలోని పాత మున్సిపల్‌శాఖ కార్యాలయం ఎదురుగా గతంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ప్రాజెక్టు ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్ (పీవోడీటీటీ) కార్యాలయం ఉండేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ కార్యాలయాన్ని ఖాళీ చేయించి ఓ వైసీపీ నేత కుటుంబానికి కేటాయించారు. అప్పట్లో నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ అనుచరుడి కుటుంబం కూడా ఈ ఆక్రమిత కార్యాలయంలో ఉండేటట్లు అనిల్ కూడా సహకరించారన్న విమర్శలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం స్వయంగా అనిల్ సూచించిన వ్యక్తికే ఈ కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో అప్పగించారనే చర్చ ఉద్యోగవర్గాల్లో సాగుతోంది.

● భవనం కూలడంతో వెలుగులోకి...

ఈ క్రమంలో ఇటీవల మలేరియా విభాగం వారు దోమల నివారణకు ఉపయోగించే రసాయనాలు, మందులు ఉన్న పాత భవనం దంతెలు చోరీకి గురికావటంతో ఆ భవనం కూలిపోయింది. దీంతో ఆ రసాయనాలను పాత పీవోడీటీటీ కార్యాలయానికి మార్చాలని మలేరియా విభాగం ఉద్యోగులు ప్రయత్నించారు. అయితే అందులో ఉన్న ఆక్రమణదారుడు తాను ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ చేయనని, అనిల్ చెబితేనే చేస్తానని చెప్పడమేకాక వైద్య ఆరోగ్యశాఖలోని ఓ ఉన్నతాధికారి తనకు అండగా ఉన్నారని,మీరేం చేసుకుంటారో చేసుకోండి అని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఉద్యోగులు ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చూద్దాంలే.. అంటూ వాయిదా వేశారు.

● రూ. వేలల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆక్రమణదారుడు ఈ కార్యాలయంలో యథేచ్ఛగా రాజభోగాలు అనుభవిస్తున్నాడు. ఈ కార్యాలయం విద్యుత్ బిల్లులను వైద్యఆరోగ్యశాఖే చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మూడేళ్లలో రూ. వేలల్లో బిల్లుల కింద చెల్లించారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇక్కడ నూతనంగా నిర్మించిన గోషా ఆసుపత్రి నీటివిభాగం నుంచి నీటి వినియోగం కూడా ఉచితంగా పొందుతున్నాడు. ఇకపోతే ఆక్రమణకు గురైన కార్యాలయం ముందు భాగంలో దుకాణాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కార్యాలయం కనిపించకుండా ఈ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నిర్మాణం కూడా పక్కాగా చేపట్టినట్లు తెలుస్తోంది. వీటికి కూడా విద్యుత్ బిల్లులను వైద్య ఆరోగ్యశాఖే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ ఆక్రమణలపై పోలీసు కేసు పెట్టి ఖాళీ చేయించాల్సి ఉన్నా వైద్యాధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లాకు చెందినవారు ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. ఈ ఆక్రమణల పై వారు దృష్టిపెట్టి ఖాళీ చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు పరిస్థితిని తెలియచేశాం..



వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కార్యాలయం ఆక్రమణలకు గురైందని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు తెలియచేశాం. వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులపై చర్యలు తప్పవు.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

అమరావతికి విరాళం

● రూ.1.07 లక్షలు అందజేసిన మర్రిపాడు రైతులు




రాజధాని నిర్మాణం కోసం మంత్రి ఆనంకు విరాళం అందచేస్తున్న మర్రిపాడు రైతులు

నెల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణంలో భాగస్వాములు అయ్యేందుకు మర్రిపాడు రైతులు ముందుకొచ్చారు. తమవంతుగా రూ.1.07 లక్షలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డికి శుక్రవారం రాత్రి నెల్లూరులోని ఆనం నివాసంలో అందజేశారు. తమ పింఛన్ మొత్తాన్ని రాజధాని నిర్మాణానికి అందజేసినట్లు రైతులు వెల్లడించారు. రైతుల త్యాగాన్ని, చొరవను మంత్రి ఆనం అభినందించారు. అద్భుతమైన రాజధాని నిర్మాణం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి రాజ్యాంగబద్ధమైన పాలనను అందిస్తోందని, అదే స్ఫూర్తితో అమరావతి రాజధాని నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని తెలిపారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో రెండేళ్లలో అమ రావతిని నిర్మించి ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

జగన్‌రెడ్డి కాదు ... లెవన్‌రెడ్డి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 5 : అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఐదేళ్ల అడ్డగోలుగా దోచుకున్న జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబుపై విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందని, ఆయన జగన్ రెడ్డి కాదని... 11 సీట్లకే పరిమితమైన లెవన్ రెడ్డి అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోటంరెడ్డి మాట్లాడారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వాతంత్ర్య సమర యోధుడు కాదని.. ఎన్నికల్లో ఈవీఎంలు ధ్వంసం చేసిన క్రిమినల్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో నెల్లూరు సెంట్రల్ జైలుకు వస్తానని ముందే గ్రహించిన జగన్ జైల్లో వసతులు ఎలా ఉన్నాయో చూసేందుకు వచ్చారని దుయ్య బట్టారు. జగన్ ఆర్థిక ఉగ్రవాది కాబట్టే ఆయన కళ్లకు పిన్నెల్లి మంచోడుగా కనిపిస్తున్నాడ న్నారు. జగన్ చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలన్నారు. ఓ క్రిమినల్‌ను పరామర్శించేందుకు జగన్ రూ.25 లక్షలు ఖర్చు పెట్టి నెల్లూరుకు వచ్చారన్నారు. తనను కారుతో గుద్దించి హత్య చేయాలనుకున్నది వైసీపీ ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నేతలు పిట్టి సత్యనారాయణ, కువ్వారపు బాలాజి, పసుపులేటి మల్లికార్జున్, ప్రశాంతి, మహేంద్రరెడ్డి, సుభాన్‌బాషా, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈవో సస్పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 5 : ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీటీ సెల్విని సస్పెండ్ చేస్తూ ఏపీఎస్సీసీఎఫ్‌సీ ఎండీ ఉత్తర్వులు పంపారు. వీటిని సెల్వికి శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ వెంకటయ్య అందచేశారు.

కన్నతండ్రే కామాంధుడు

● మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి తీసుకెళ్లి అత్యాచారం

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడి వివరాలు తెలియచేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైం), జూలై 5: వరుసకు తండ్రి అయిన ఆ ప్రబుద్ధుడు.. తల్లి తీసుకు రమ్మన్నదని పాఠశాల వద్దకు వెళ్లి ఆ బాలికకు మాయమాటలు చెప్పాడు. తండ్రితోనే కదా వెళుతున్నానని నమ్మిన ఆ బాలికను ఆ కామాంధుడు బల్లిపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. మిస్సింగ్ ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు స్పందించి కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నగర డీఎస్పీ డీ శ్రీనివాసులురెడ్డి విలేకరులకు వివరించారు.

టీపీ గూడూరు మండలానికి చెందిన ఓ మహిళ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నది. ఆమెకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మొదటి భర్తతో విభేదాలు కారణంగా విడిపోయి, మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం విశ్వనాథపురానికి చెందిన కొమ్మి మల్లికార్జునను రెండో వివాహం చేసుకుంది. వారంతా వెంకన్నపాలెంలోనే కాపురం పెట్టారు. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. దీంతో భార్యపై కక్ష సాధించాలని మల్లికార్జున నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే వరుసకు కూతురయ్యే బాలికపై కన్నేశాడు. గత నెల 29న మహాలక్ష్మీపురం పాఠశాలలో చదువుకుంటున్న బాలిక వద్దకు వెళ్లాడు. వస్త్రాలు కొనిస్తానని, అమ్మకు చెప్పానని మాయమాటలు చెప్పాడు. మోటారు సైకిల్‌పై ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బల్లిపల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అదే రోజు రాత్రి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా మరో రెండు సార్లు అత్యాచారం చేశాడు. బాలిక కన్పించకపోవడంతో పాఠశాల వద్దకు వెళ్లి విచారించిన తల్లి గత నెల 30న టీపీ గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతికత ఆధారంగా నిందితుడు కనిగిరి మండలం బల్లిపల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్నాడని గుర్తించారు. దీంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి, బాలికను సురక్షితంగా తల్లికి అప్పగించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైరు చోరీ

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి సమీపంలోని పాత రైస్‌మిల్లు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని రాగి వైరు, ఆయిల్‌ను చోరీ చేసి నట్లు శుక్రవారం స్థానికులు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పెండ్యాల ఎరుకలయ్య, మేడేపల్లి వెంకటేశ్వర్లు, మేడేపల్లి సుబ్బరావులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లకు అమర్చిన విద్యుత్ వైర్‌ను చోరీ చేశారు. ఈ రెండు గ్రామాల్లో రెండు రోజులుగా చోరీలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లు చోరీకి గురవుతుండడంతో రాత్రివేళ రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. చోరీలకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని బాధితులు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), జూలై 5 : తాళం వేసిన ఇంటిలోకి చొరబడి బంగారు, టీవీ అపహరిం చారన్న కేసులో నేరం రుజువు కావడంతో షేక్ ఖలీల్ అలియాస్ అబ్బు, కందరాజు సురేష్ అనే నిందితులకు ఒక్కొక్కరికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నెల్లూరు నగర 5వ అదనపు మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గండికోట దేవిక శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు నగరం వికలాంగుల కాలనీకి చెందిన షేక్ ఖలీల్ అలియాస్ అబ్బు రౌడీ షీటర్, ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం కొండరాజుపల్లి గ్రామానికి చెందిన కొండరాజు సురేష్ అతని స్నేహితుడు. ఇద్దరూ కలసి చోరీలకు పాల్పడేవారు. నెల్లూరులోని తల్పగిరి కాలనీకి చెందిన మండవ జ్యోతి అనే జూనియర్ లెక్చరర్ ఇంటికి తాళం వేసి ఉండగా 2023 జూన్ 9వ తారీఖున నిందితులు చోరీకి పాల్పడ్డారు. జ్యోతి ఇంటికి వచ్చి చూడగా రూ.1.80 లక్షల విలువ చేసే బంగారు నగలు, 40 వేల రూపాయల విలువ చేసే టీవీ అపహరణకు గురైనట్టు గుర్తించారు. వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ కాలంలో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఏడాది జైలు శిక్షతోపాటు 500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కల్పన వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	135
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	270
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6929
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ. 95.10

బలమైన శక్తిగా సహకార వ్యవస్థ

● రైతులు, పేద, మధ్యతరగతి వర్గాలకు రుణసాయం

● నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం) జూలై 5: జిల్లాలో సహకార వ్యవస్థ బలమైనశక్తిగా వెలుగొందుతోంది. సహకార రంగంలో బ్యాంకులు, సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. ఎప్పుడో వేసిన సహకార పునాది నేడు అంచలంచెలుగా ఎదిగి ప్రాధాన్యం సంతరించుకుంది. కొంతమంది వ్యక్తులు కలిసి, అందరి బాగోగుల కోసం పనిచేయడాన్ని సహకారం అంటారు. ఒక్కరు చేయలేని పనిని కొంతమంది కలిసి చేయవచ్చు. ఇలా కొంతమంది కలిసి ఉమ్మడి లక్ష్యం కోసం ఉద్యమించటమే సహకార ఉద్యమం. ఇలా కొంత మంది కలిసి ఏర్పాటు చేసిన సంఘాలే సహకార సంఘాలు. ఇందులో భాగస్వాములైన వారికి కొన్ని నిర్దిష్టమైన ఆశయాలు ఉంటాయి. సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయి. అంతా కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం (నేడు) అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జిల్లాలో భారీ ఎత్తున నిర్వహించనున్నారు.

● 1904లో ఉద్యమం ప్రారంభం

తొలుత జర్మనీలో సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. అనంతరం ప్రపంచ వ్యాప్తంగా సహకారోద్యమం ప్రారంభమైంది. మనదేశంలో 1904లో ఈ ఉద్యమం ఆరంభమైంది. వీటికి సాయం చేయడానికి ప్రభుత్వంలో సహకార మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిలో సహకార భూమి తనఖా బ్యాంకులు ఏర్పడ్డాయి. వివిధ రంగాల్లో కూడా ఎన్నో సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. రైతులే సహకార సంఘాన్ని స్థాపించుకొని, తద్వారా తమకు కావాల్సిన నాణ్యమైన పరికరాలు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు పొందే వీలుంది. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుకోవచ్చు. ఎంతగానో విస్తరిస్తున్న సహకాక సంఘాలను




నియంత్రించాలనే లక్ష్యంతో 1964లో ఏపీ సహకార సంఘాల చట్టం రూపొందించబడింది. అనంతరం 1995లో రూపొందించిన పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం ఎంతో విలక్షణమైంది. ఈ చట్టం కింద రిజిస్టర్ అయ్యే సహకార సంఘాలకు ప్రభుత్వసాయం ఉండదు. లాభన ష్టాలకు, సాధక బాధకాలకు సహ కార సంఘ సభ్యు లు పాలక మండ ళ్లదే బాధ్యత.

● 78 కోఆపరేటివ్ సొసైటీలు

జిల్లాలో 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీ ఎస్‌లు) ఉన్నాయి. జిల్లా విభజనకు ముందు వీటి సంఖ్య 98గా ఉండేది. ఇవి రైతులకు ఎంతగానో మేలు చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉంది. ఈ బ్యాంకు ద్వారా రైతులు పంట, బంగారు రుణాలను ఇతోధికంగా అందు కొంటున్నారు. అలాగే నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఉంది.ఇది పేద, మధ్య తరగతి వారికి విరివిగా రుణాలను అందచేస్తున్నది.


ఘనంగా నిర్వహిస్తాం



అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహి స్తాం. సహకార రంగంలో సంఘాలు బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నాం. సహకార సంఘాలను డిజిటైజేషన్ చేసే ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తాం.

- గుర్రప్ప, జిల్లా సహకారశాఖాధికారి

సేవలు విస్తరించాం...



నెల్లూరు పొగతోటలో ఉన్న నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 108 ఏళ్ల ఘన చరిత్ర కలిగి ఉంది. మా బ్యాంకు ద్వారా సేవలను విస్తరిస్తున్నాం. రూ.50 లక్షల వరకు లాభాపేక్షలేని రుణాలను పేద, మధ్య తరగతి ప్రజలకు అందచేస్తు న్నాం. ఒకప్పుడు రూ. 500 రుణాన్ని మాత్రమే ఇచ్చిన మా బ్యాంకు ప్రస్తుతం రూ.50లక్షల వరకు రుణాలను అందచే స్తోంది. మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టాం.

- అరిగెల నాగేంద్రసాయి చైర్మన్, జిల్లా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు

సోమశిలలో 10.123 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూలై 5: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి డ్యాంలో 10.123 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 316 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

త్వరలో సోమశిల అభివృద్ధి పనుల ప్రారంభం

అనంతసాగరం, జూలై 5: సోమశిల జలాశయం వద్ద ఏడాదిన్నరగా నిలచిన కీలక ఆప్రాన్ పనులు త్వరలో ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది. గత వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో అత్యవసరంగా చేయాల్సిన (ఆప్రాన్, డౌన్ స్ట్రీమ్, ప్రొటెక్షన్ వాల్) పనులను సంబంధిత గుత్తేదారు ఆపేశారు. ఈనేపథ్యంలో నిలిచిన పనులు పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌తో ప్రభుత్వ పెద్దలు చర్చించినట్లు సమాచారం. దీంతో వారం రోజుల్లో తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు.

18న ఒంగోలు జాతి పశువుల వేలం


నెల్లూరు(వ్యవసాయం), జూలై 5 : జిల్లాలోని కొండాపురం మండలం చింతలదేవిలో ఉన్న మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రంలో ఈనెల 18వతేదీన 65 ఒంగోలు జాతి పశువులను వేరువేరుగా వేలం ద్వారా విక్రయించనున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ వీ కోటేశ్వరరావు మరో ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ముందుగా చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. ఔత్సాహికులు, పశు పెంపకం దారులు ఈ నెల 16, 17తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటలలోపు వచ్చి వేలానికి సిద్ధం చేసిన పశువులను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

నేడు యాంటీ రేబిస్ టీకాల పంపిణీ

● 33 వేల డోసులు సిద్ధం

నెల్లూరు(వ్యవసాయం), జూలై 5 : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లాలో ఉన్న ప్రాంతీయ పశువైద్యశాలలు, వెటర్నరీ పాలీక్లినిక్స్‌లో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వీ కోటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం 33వేల డోసుల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

మంత్రులను కలిసిన కలెక్టర్ ఆనంద్



మంత్రులు రామనారాయణరెడ్డి, నారాయణతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 5 : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ ఆనంద్ శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను నెల్లూరులోని మంత్రి ఆనం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనంద్‌కు జిల్లా అభివృద్ధికి సంబంధించి మంత్రులు పలు సూచనలు చేశారు.

తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన



ఉదయగిరి తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

ఉదయగిరి రూరల్, జూలై 5: మండలంలోని పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని ఖాతాదారులు శుక్రవారం ఉదయగిరి సబ్ పోస్టాఫీసు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో బోడబండ, పుల్లాయపల్లి గ్రామాలకు చెందిన తాము ఆర్డీ నగదును దాచుకున్నట్లు చెప్పారు. అయితే బ్రాంచ్ పోస్టుమాస్టర్ షేక్ నాయబ్‌రసూల్ మాతో నగదు విత్‌డ్రా చేసేందుకు పాన్‌కార్డు అవసరమని నమ్మించాడన్నారు. పాన్‌కార్డుల కోసమని విత్‌డ్రా ఫారాల మీద సంతకాలు చేయించుకుని నగదు డ్రా చేసుకున్నాడని మండిపడ్డారు. మా నగదు స్వాహా చేసిన బీపీఎంను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వేగూరు సాయికృష్ణ ఆందోళనకారులతో చర్చించారు. నగదు మాయంపై విచారణ జరుపుతున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన ఖాతాదారులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కల్లూరి కృష్ణారెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు గౌరవం

● వారి రక్షణకు కమిటీ ● వెబెక్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 5 : పనిచేసే ప్రదేశంలో మహిళలకు గౌరవం కల్పిస్తూ, వారి రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జాయిం ట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్ నుంచి వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ఎన్జీవోలు, ప్రైవేటు సంస్థల వారితో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మహి ళా ఉద్యోగులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు జిల్లా స్థాయిలో పంచాయతీ అధికారి చైర్‌పర్సన్‌గా కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు పనిచేస్తున్న ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మహిళలపై దాడులను నిరోధించడానికి వివిధ రూపాల్లో ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు 'రత్నం' విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న జీఎం రామ్మూర్తి నాయుడు

నెల్లూరు (విద్య), జూలై 5 : నెల్లూరులోని డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన 8వతరగతి విద్యార్థిని కే జనని, 7వతరగతి విద్యార్థిని కే మోక్ష ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీల్లో ఉత్తమంగా రాణించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ కే కృష్ణకిషోర్, వాసంతి కూడా విద్యార్థులను అభినం దించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు భరద్వాజ్, చాముండేశ్వరి, పాఠశాల జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి విరివిగా రుణాలు ఇవ్వాలి

● ఎన్‌డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 5 : వ్యవసాయ అవసరాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్, ఎన్‌డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి సేతు మాధ వన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఎన్‌డీ సీసీబీలో శుక్రవారం ఆ బ్యాంకు బోర్డు సమా వేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ వ్యవసాయ అవసర రుణాల మంజూరును వేగవంతం చేయడానికి పలు సూచనలు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక సహకారం అందించడానికి కర్షక మిత్ర, పీఎం సూర్య ఘర్, పీఎం విశ్వకర్మ, కలలు సాకారం అనే సరికొత్త పథకాలను ప్రవేశపెట్టారు. వాయిదా మీరిన రుణాల వసూళ్లు చేయాలన్నారు. బ్యాంకు డిపాజిట్ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని సూచించారు. బ్యాంకు ఆవరణలో ఉన్న దుకాణాలు ఖాళీ చేయని యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల డిజిటలైజే షన్‌ను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల హెచ్‌ఆర్ అంశాన్ని సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివా సరావు, డీసీవో గుర్రప్ప, అధికారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడి రాక

నెల్లూరు(హరనాథపురం), జూలై 5 : జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వివా శనివారం నెల్లూరుకు వస్తున్నారు. జిల్లాలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల పనితీరు, ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు ఆయన వస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో తిక్కన ప్రాంగణంలో సమావేశమవుతారు. అనంతరం తిరుపతికి వెళతారు.

పాత కక్షలతో యువకుడి హత్య

● గంటల వ్యవధిలో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైం), జూలై 5: పాత కక్షల నేపథ్యంలోనే నీతిరాజ్ అనే యువకుడి హత్య జరిగిందిని, నేరం జరిగిన గంటల వ్యవధిలోనే 10 ప్రత్యేక బృందాల ద్వారా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. నెల్లూరులోని రామకోటయ్య నగర్‌లో ఈ నెల 4వ తేదీ సాయంత్రం శేఖర్ నీతిరాజ్ హత్య జరిగింది. కేసు ఛేదించిన వివరాలను శుక్రవారం రాత్రి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్పీ మీడియాకు వెల్లడించారు. రామకోటయ్యనగర్‌కు చెందిన పూజారి చంద్రశేఖర్ అలియాస్ చందుకు అదే కాలనీకి చెందిన దేవానంద్‌తో గొడవలున్నాయి. ఈ క్రమంలో గతేడాది జూన్ 29న దేవానంద్, అతని స్నేహితులు శేఖర్ నీతిరాజ్, జీవన్‌సాగర్, వెంకటేష్, మోజేష్‌తో కలిసి చంద్రశేఖర్‌పై హత్యాయత్నం చేశారు. ఆ దాడిలో చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి చంద్రశేఖర్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం రామకోటయ్య నగర్‌లో చంద్రశేఖర్ అతని స్నేహితులు షఫ్రక్ రహమాన్, షేక్ అస్మిత్, చంద్రగిరి శ్రీనివాసులు, సుమంత్‌తో కలిసి మద్యం సేవిస్తుండగా శేఖర్ నీతిరాజ్, అతని స్నేహితుడు షఫ్రక్ అఫ్రోజ్ సమీపంలోని ఓ బార్ వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో అఫ్రోజ్ ద్వారా నమ్మకముగా శేఖర్ నీతిరాజ్‌ను వారు ఉన్న ప్రదేశానికి పిలిపించారు. అందరూ కత్తులతో దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నెల్లూరు ఏఎస్పీ సౌజన్య నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలతో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తు అధికారి, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ సిబ్బంది సహకారంతో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా, తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన శేఖర్ నీతిరాజ్ మృతదేహాన్ని శుక్రవారం జీజీహెచ్‌లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. ఈ హత్య వెనుక స్థానిక వైసీపీ నేతల హస్తం ఉందని నీతిరాజ్ కుటుంబ సభ్యులు, బంధువులు, తెలుగు దేశం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు సమ గ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని నీతిరాజ్ తండ్రి తండ్రి వనరాజ్ కోరారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సంతానలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉదయగిరి రూరల్, జూలై 5: స్థానిక బీసీ కాలనీలోని సంతానలక్ష్మి ఆలయంలో జేష్ఠమాస శుక్రవారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనమిచ్చారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూలై 5: బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో శుక్రవారం ఎంఈవో-1 మస్తాన్‌వలి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలన్నారు. అనంతరం కొత్తపల్లి గిరిజన కాలనీలో బడికిరాని విద్యార్థుల నివాసాలకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఏడుకొండలు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత



ఎక్స్‌కవేటర్‌తో గుంతలు పూడ్చుతున్న అధికారులు

సంగం, జూలై 5: మండలకేంద్రానికి వెళ్లే రహదారిపై ఉన్న గుంతలను శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. సంగం టౌన్‌లోని రహదారిలో టీడీఆర్ కల్యాణ మండపం సమీపంలో సిమెంట్, తారురోడ్డు అనుసంధానం వద్ద దెబ్బతిని డ్రైనేజీ నీరు నిలబడి అధ్వానంగా తయారై ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. దీంతో ఆర్‌అండ్‌బి అధికారులు డ్రైనేజీ నీరు నిలవకుండా జేసీబీతో గుంతలను పూడ్చివేశారు. అదేవిధంగా సంగం కొండ మలుపులో పలు చోట్ల గుంతలు పూడ్చివేశారు. రహదారి పక్కన వేసిన కోళ్ల వ్యర్థాలను, చెట్ల కొమ్మలను తొలగించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎల్ఐసీ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 5: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ ఆత్మకూరు శాఖ ఛైర్మన్ మహ్మద్ సాదిక్ హుస్సేన్, ఎస్ఆర్‌జెడీ పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఆత్మకూరు ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది యువతీ, యువకులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ కార్యదర్శి ఎస్ శ్యామ్‌ప్రభాకర్, అధ్యక్షుడు ఎస్ ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ టి రమేష్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సందాని, పలువురు ప్రజాసంఘాలు, జెవివి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ఆత్మకూరు, జూలై 5: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి లక్ష్మీపతి అధికారులను కోరారు. మండలంలోని మురగళ్లలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం వారు పరిశీలించి, కూలీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా, గ్రామ కమిటీ సభ్యులు పి వెంకటేశ్వర్లు, టి రఘురామ్, కేవీపీఎస్ నాయకుడు జి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట, జూలై 5: మండలంలోని హసనాపురం గ్రామంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ గౌస్ బాషా కోరారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు 2024-2025 సంవత్సరానికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5గంటల లోగా ఐటిఐ.ఎపి.జిఒవి.ఐఎన్ అను వెబ్ సైట్‌లో ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 27వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరుకావాలని కోరారు.

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం, జూలై 5 : పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే (జూనోసిస్) వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధులు ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, వ్యవసాయం చేసే రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాల సిబ్బందికి, పరిశోధనాలలో పనిచేసే వారికి సంక్రమిస్తాయని తెలిపారు. వ్యాధులు సోకిన మనుషులలో జ్వరం, తలనొప్పి, దురద, అనారోగ్యం, ఉద్రేకం, నోటినుంచి చొంగ కారడం, కళ్లలో నీరు కారడం, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కాగా ఈనెల 6న జూనోసిస్ డేని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

రేపు ఎడ్ల బండలాగుడు పోటీలు

కావలి రూరల్, జూలై 5: కావలి మండలం చౌదరిపాలెంలో ఆదివారం సేద్యపు ఎడ్ల బండలాగు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజుల పండుగను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

అటకెక్కిన 'చేతుల శుభ్రత'

● విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు గండి ● పథకంపై దృష్టి లేదు

ఆత్మకూరు, జూలై 5: ప్రభుత్వ పాఠశాలల్లో చేతుల శుభ్రత పథకంపై విద్యా, వైద్యాధికారులు దృష్టిసారించడంతో అటకెక్కింది. రోజు భోజనం చేసే ముందు చేతులు కడుక్కోవడంపై విద్యార్థులను ఉపాధ్యాయులు చైతన్యం చేయడం లేదు. పాఠశాలలో అధికారులు సబ్బులు ఏర్పాటు చేయకపోవడం మరో విశేషం. ఆత్మకూరు మండలంలో 76ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 60ప్రాథమిక, 3ప్రాథమికోన్నత, 13జిల్లా ఉన్నత పాఠశాలున్నాయి. వీటిలో 5,050మంది పిల్లలు చదువుతున్నారు. విద్యార్థుల పరిశుభ్రతపై అవగాహన పెంచాలనే సర్వశిక్షాభియాన్ ఉన్నత లక్ష్యం నీరుగారిపోతోంది.

స్వచ్ఛమైన తాగునీరే గతి లేదు..

చేతుల పరిశుభ్రత ఎలా ఉన్నా మధ్యాహ్న భోజనం చేయడానికి స్వచ్ఛమైన తాగునీరు లేని పరిస్థితి పాఠశాలల్లో ఉంది. తాగేందుకు విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. తాగునీటి పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. సమస్యలు ఇలా ఉంటే ఇక చేతుల పరిశుభ్రత మాటేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని పాఠశాలల్లోను చేతుల శుభ్రత పథకం అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

రోడ్లపైనే ఆవులు, కుక్కల స్వైరవిహారం

● పట్టించుకోని పోలీసులు, పంచాయతీ అధికారులు

● ఉదయగిరిలో ఇది దుస్థితి



ఉదయగిరి వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

ఉదయగిరి, జూలై 5: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వందల సంఖ్యలో ఆవులు, కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఆవులు రోడ్డుకి అడ్డంగా నిలవడం, పడుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది, రాత్రి పగలు తేడా లేకుండా అవి సంచరిస్తుంటే బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆవులను, ఎడ్లను దేవుడి మొక్కు పేరుతో కొనుగోలు చేసి వదిలి వేస్తున్నారు. ఆవులు, ఎద్దు వీధులో సంచరిస్తుంటే పలువురు వాటికి పూజలు చేసి ఆహారం పెడుతుంటారు. దీంతో అవి తిని తిరుగుతుంటాయి. పుట్టిన దూడలను వాటి యజమానులు తోలుకుపోయి మంచి రేట్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుం టున్నారు.మిగిలిన వారు కూడా ఇది మంచి వ్యాపారంగా భావించి వాటిని కొని వదిలి వేస్తున్నారు. ప్రస్తుతం 200 ఆవులు, ఎద్దు రోడ్లపై కనిపిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాగే వీధి కుక్కలు పట్టణంలోని పలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కి వెళ్లే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. సరుకులు, టిఫన్, మాసం తీసుకెళుతున్న వారిపై దాడి చేసి కవర్లను పీకే స్తు న్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పోలీసులు స్పందించి వీధుల్లో సంచరి స్తున్న ఆవులు, కుక్కలను నియంత్రించాయి.

కాడెద్దుల వ్యవసాయం.. కనుమరుగు

● వ్యవసాయంలో పెరిగిపోయిన ఆధునిక యంత్ర సాంకేతికత

● ఖర్చు తక్కువ.. సమయం ఆదా ● భారమవుతోన్న పోషణ



పొలం దున్నుతున్న కాడెడ్లు

సీతారామపురం,జూలై 5: ఒకప్పుడు వ్యవసాయం చేసే వారి ఇంటి వద్ద ఎద్దులు, బండి, పశువుల కొట్టంతో సందడిగా ఆహ్లాదకర వాతావరణం ఉండేది. ఎడ్ల బండి ఉన్న వారికి ఏడాదంతా పనిదొరికేది. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో అన్నదాతలు తక్కువ సమయంలోనే తమ పనులను ముగించుకొనేలా ఆధునిక యంత్రాలు అందుబాటులో వచ్చాయి. నేటి తరంలోని అన్నదాతల ఇంటి ముంగిట ట్రాక్టర్లు దర్శన మిస్తున్నాయి. కాడెడ్లకు బదులు కల్టివేటర్లు పనిచేస్తున్నాయి. ఎడ్ల బండి ఉన్నా వారినే వ్యవసాయానికి పిలిచేవారు రైతులు చెబుతున్నారు. ఒకప్పుడు ఏ పొలంలో చూసినా జాతి ఎడ్లతో వ్యవసాయ పనులు, దుక్కులు, అడుసు దున్నేవారు. కానీ ఇప్పుడు తక్కువ సమయంలోనే ఎక్కువ పనులను చేసేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావ డంతో పాటు చకచకా పనులు చేసుకునే వెసులుబాటు కలగడంతో రైతన్నలు వాటివైపు మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీలపై ఆధునిక యంత్రాలు..ఒకప్పుడు ఏవిధమైన ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయం చేసేవారు. కానీ ప్రస్తుతం వ్యవసాయానికి ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక, ఆధునిక పరికరాలు, యంత్రాలు, కోత మిషన్లు, నూర్పిడి యంత్రాలు వంటివి ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సులభ వాయిదాల్లో యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎద్దుల వ్యవసాయం రానురాను కనుమరుగైపోయింది. సీతారామపురం మండల ప్రాంత జనాభాలో 70శాతం మంది రైతులు ఉన్నారు. వీరిలో 70శాతంకు పైగా రైతులకు అన్ని వసతులతో కూడిన సాంకేతిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

గతంలో భలే గిరాకీ...గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే అన్నదాతలు ఎద్దులు, బండ్లు సిద్ధం చూసుకొనే వారు. వీటికి మంచి గిరాకీ ఉండేది. సాగుకు అవసరమైన పనులు చేయించుకొనేందుకు ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి మరీ ఆఫర్‌లో పెట్టుకొనేవారు. కూలీలకు కూడా గిరాకీ ఉండేది. ఇప్పుడు కేవలం కలుపులు తీయడానికి, పురుగు మందులు చల్లడానికి తప్పితే కూలీలకు పెద్దగా పనులు ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. కాడెడ్ల పోషణ కూడా భారమైపోతుంది. ప్రస్తుత మార్కెట్‌లో జత ఎద్దు కొనుగోలు చేయాలంటే సుమారు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు డిమాండ్ ఉంది. అంత ఖర్చు చేసినా కేవలం ఇంటి ముందు ఉంచుకోవడానికి తప్పితే వ్యవసాయానికి అంతగా వినియోగపడటం లేదని రైతులు వాపోతున్నారు. ఇక సన్న, చిన్నకారు రైతులు వాటి జోలికి పోవడం మానేశారు.

వామ్మో పులి.. అడవికెళ్లేందుకు జంకుతున్న జనం


ఉదయగిరి రూరల్, జూలై 5: వెలుగొండ అడవుల్లో రెండు పులులు సంచరిస్తున్నాయని అటవీ శాఖాధికారులు నిర్ధారించడంతో అడవులకు వెళ్లేందుకు జీవాల యజమానులు, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు జంకుతున్నారు. గతంలో చిరుతలు మేకలు, ఆవుల మందలపై దాడి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఉదయగిరి పట్టణ వాసులు కోన కాలువ నీటి కోసం తెల్లవారుజామున 3 గంటల నుంచే అటవీ ప్రాంతానికి వెళుతుంటారు. ప్రస్తుతం అడవిలో పులి సంచరిస్తుందని తెలపడంతో అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. సంబంధిత అధికారులు అటవీ ప్రాంతానికి సమీపాన ఉండే గ్రామాల ప్రజలు, జీవాల యజమానులకు తగు సూచనలు, సలహాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా జాతీయ రహదారి


● వేగ నియంత్రణ చర్యలేవి ● విచ్చలవిడిగా పశువుల సంచారం

● నిత్యం ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, జూలై 5: మండలంలో కొన సాగుతున్న జాతీయ రహదారి ప్రమాదాలకు నిల యంగా మారింది. ముఖ్యంగా నకిరికెల్ నుంచి తిరు పతి ఏర్పేడు వరకు జాతీయ రహదారి 565 విస్తరించి వుంది. మండలంలో చుంచులూరు నుంచి అనంత సాగరం మండలంలోని గోగులపల్లి, ఉప్పలపాడు వర కు కలువాయి మండలం మీదుగా రాపూరు, ఏర్పేడు వరకు కొనసాగుతోంది. అయితే ఉప్పలపాడు వద్ద సోమశిల- ఆత్మకూరు, జాతీయ రహదారి కలిసే ప్రాంతంలో జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణ పనులు చేప ట్టారు. అక్కడ రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మృతి చెందిన ఘట నలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో వేగ నియంత్రణ చర్యలు చేపట్టక పోవడంతో ఇబ్బం దు లు తప్పడం లేదు. రహదారిపై రాత్రి, పగలు అనే తేడా లేకుండా పశువులు సంచ రిస్తుండటంతో చిలకలమర్రి, గుడిగుంట, ముస్తాపురం, గోగులపల్లి గ్రామాల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రహదారి వెంట ఉన్న గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కొన్ని ప్రాంతాల్లో వెలగక పోవడంతో విద్యుత్ స్తంభాలు అలం కారప్రాయంగా ఉన్నాయి. అధికా రులు స్పందించి పశువులు రహ దారి మీదకు రాకుండా రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చిలకలమర్రి వద్ద జాతీయ రహదారి



అలంకార ప్రాయంగా విద్యుత్ దీపాలు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



పమిడిపాడు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

అభివృద్ధికి సహకరించాలి

● కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 5: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ. ఆనంద్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

చిట్రగుంట, జూలై 5: బోగోలు రాజావీధిలోని షిరిడీ సాయి మందిరంలో శుక్రవారం బచ్చు అమరా వర్ధంతిని పురస్కరించుకుని పేదలు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకు మార్, సంధ్య దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిసేవకులు ఆనందసాగర్, మధుసూదనరావు, హరిబాబు, సాగర్, విజయలక్ష్మీ, గీత, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యం

ఉలవపాడు, జూలై 5: వేరుశనగ సాగులో అధిక దిగుబడి సాధించడానికి సమగ్ర పోషకాల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం రైతుసేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు ఏర్పాటుచేసి నట్లు ఏవో తిరుమల జ్యోతి తెలి పారు. కందుకూరుకు చెందిన కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్, మరో ఇద్దరు శాస్త్రవేత్తలు వెంకటేష్, జయలు చీడపీడల యాజమాన్యం, నేలద్వారా సంక్రమించే మొదలు కుళ్లు, వేరుకుళ్లు, ఎండు తెగులు, సమజ నూనెల తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పించనట్లు చెప్పారు. రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలం జిగురు అట్టలు, పచ్చ పురు గు, లద్దె పురుగు నివారణకు బుట్ట లు, జీవన ఎరువులు, జీవన శిలీంద్ర నాశినులు ఇవ్వడం జరిగిందని తెలి పారు. సదస్సులో రైతులు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, చరణ్‌సాయి కుమార్, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు కృష్ణారెడ్డి, స్థానిక వేరుశనగ సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రితో ఉదయగిరి ఎమ్మెల్యే భేటీ



మంత్రి అచ్చెన్నాయుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, జూలై 5: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని మంత్రి పేషీలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కె అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయగిరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో ప్రకాశం జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు.

బీద రవిచంద్రకు సత్కారం



బీద రవిచంద్రను సత్కరిస్తున్న వేదపండితులు

కావలిటౌన్, జూలై 5: అర్చకులు, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను వేదపండితులు కోరారు. కావలి ఆచారపు పెద్దింటి యాదవ్, సమాధి కృష్ణ ఆధ్వర్యంలో కావలికి చెందిన వేదపండితులు శుక్రవారం రవిచంద్రను నెల్లూరులోని ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి ఆశీర్వచనాలు అందించారు.

దివ్యాంగుడికి మోటార్‌సైకిల్ వితరణ

కావలి, జూలై 5: కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్టీ కాలనీకి చెందిన దివ్యాంగుడు చలంచర్ల ప్రహ్లాద్‌కు మూడు చక్రాల స్కూటీని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వితరణ చేశారు. కావలి పట్టణ ముసునూరులోని ఆయన నివాసం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా దివ్యాంగుడికి వాహనాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, రుద్రకోట టీడీపీ నాయకులు డీ తిరుమల, వల్లెపు బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కొండాపురం, జూలై 5: మండల పరిధిలోని భీమవరప్పాడు, ఎస్సీ, సాయిపేట ఎస్టీ కాలనీల్లోని పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి కే రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీచేసిన స్టూడెంట్ కిట్స్ రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. గ్రామానికి సమీపంలో ఉన్న సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం ఎస్టీకాలనీ నుండి ఏడుగురు విద్యార్థులను తన స్వంత ఖర్చులతో రవాణా సౌకర్యాన్ని కల్పించి పాఠశాలలో ప్రవేశం కల్పించిన ప్రధానోపాధ్యాయుడు వి మాధవరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సాయిపేట ఎస్టీకాలనీలోని పాఠశాలను తనిఖీచేసి మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌కు పలు సూచనలు చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కావలి, జూలై 5: కావలి పట్టణ ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాందీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 8 రోజుల పాటు నిర్వహించిన ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన సాఫ్ట్‌స్కిల్స్, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ట్రైనర్ హరికుమార్ శిక్షణ ఇచ్చారు. అనంతరం కరస్పాండెంట్ రాజకుమార్‌చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాలలో విద్యార్థులకు ఇటువంటి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

గుడ్లూరు, జూలై 5: మండలంలోని పోట్లూరులో ఇద్దరు జూదరులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్థులు అందించిన సమచారం మేరకు పోట్లూరు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేయగా ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బారావు తెలిపారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఎఫ్‌పీవో లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్లు

అల్లూరు, జూలై 5 : రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఎఫ్‌పీవో లక్ష్యమని ఆ సంస్థ అల్లూరు మండలం డైరెక్టర్లు అన్నారు. శుక్రవారం అల్లూరులో వారు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులే నిర్వాహకులుగా, డైరెక్టర్లుగా ఏర్పాటు చేసుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే ఈ సంస్థ ద్వారా రైతులు పండించిన పంటలకు దేశవ్యాప్తంగా గిట్టుబాటు ధర కల్పించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలను రాయితీ ద్వారా అందించడంలో తోడ్పాటును అందిస్తుందన్నారు. 50 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులను పొందే అవకాశం కూడా ఉంటుందని, రైతులు ఈ సంస్థలో చేరి లాభాలను పొందాలన్నారు. మూలధనం కింద రూ. 2వేలుతోపాటు ప్రవేశ రుసుముగా రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం రాఘవయ్య, కె అనీల్ కుమార్, డి హరిప్రసాద్‌రెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పి శివశంకర్, జి వెంకటేశ్వర్లు, కె శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

కావలి, జూలై 5: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అక్రమ నిర్మాణాలను తొలగించి దానికి అయ్యే ఖర్చులను వారి నుంచే రికవరీ చేయటం జరుగుతుందన్నారు. కావలి పట్టణ ముసునూరు మందాడి చెరువులోని రాళ్లగుట్ట పోరంబోకులో తొలగించిన అక్రమ నిర్మాణాలను ఆయన గుర్తుచేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కందుకూరి

అల్లూరు, జూలై 5: ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేషనల్ కమిటీ సభ్యుడు కందుకూరి సత్యనారాయణ కోరారు. శుక్రవారం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, సిబ్బంది అన్నివిధాలా సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కత్తుల కిరణ్, కె మల్లికార్జున సింగ్, చెంతాటి కృష్ణమోహన్, సిద్దా రమణయ్య, సివివి సత్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు కలుజు వద్ద పూడిక తొలగింపు

కావలి రూరల్, జూలై 5: కావలి పట్టణ తుమ్మలపెంట రోడ్డులోని తాళ్లపాలెం చెరువు కలుజు వద్ద శుక్రవారం ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పంటకాలువలు ఆక్రమించి లేఅవుట్లు వేసిన విషయాన్ని రైతులు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పంట కాలువలకు హద్దులు ఏర్పాటుచేసి పూడికతీత పనులు చేపట్టారు. అలాగే తుమ్మలపెంట రోడ్డు సమీపంలో కాలువ స్థలం ఆక్రమించి కట్టిన గోడలు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జంపాని కిరణ్, టీడీపీ నాయకలు ఉప్పాల శ్రీనివాసులు, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన ర్యాలీ



మానవహారం నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది

లింగసముద్రం, జూలై 5: మండలంలోని చినపవని గ్రామంలో శుక్రవారం లింగ సముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అతిసార నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కలిగించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి భూలక్ష్మి, ఏఎన్ఎం శాంతి మాట్లాడుతూ తొట్లలో నీరు నిల్వ లేకుండా చేయాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చేసి, దోమలు, లార్వా వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాలొన్నారు.

రక్తదాన ప్రేరేపితులకు అభినందనలు

కావలి టౌన్, జూలై 5: డాక్టర్స్ డేను పురస్కరించుకుని చేపట్టిన రక్తదానంలో ఒకేరోజు 1210 మంది రక్తదానం చేసి ఐఎంఎ చరిత్ర సృష్టించిందని కావలి ఐఎంఎ అధ్యక్షుడు కె సుబ్బారావు, సీనియర్ వైద్యులు బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముసునూరులోని ఐఎంఎ కార్యాలయంలో రక్తదాన ప్రేరేపితులైన పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రెడ్‌క్రాస్, టీం సేవియర్స్, యుటీఎఫ్, జేవీవీ సభ్యులకు అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ గోపి, డాక్టర్ నళినిపద్మ, డాక్టర్ మనోహర్‌బాబు, డాక్టర్ శివప్రసాద్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల పాదయాత్రకు సంఘీభావం



పర్చూరు టీడీపీ నేతల పాదయాత్రలో పాల్గొన్న బోగోలు తెలుగు తమ్ముళ్లు

చిట్రగుంట, జూలై 5: పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు గెలుపొందడంతో పర్చూరు నుంచి టీడీపీ నేతలు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం తిప్ప జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. వారికి బోగోలు మండల తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. వారికి సంఘీభావంగా దగదర్తి మండలం ఉలవపాళ్ల అభయాంజనేయస్వామి ఆలయం వరకు నడిచామని మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు సుధీర్‌బాబు, మాధవరావు, నేతిపిచ్చయ్య, తదితరులు ఉన్నారు.

విద్యతోనే బంగారు భవిత: ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, నెల్లూరు, జూలై 5: ప్రభుత్వ బడుల్లోని అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్వో ప్లాంటును యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తేవడంతో పాటు డైనింగ్ హాలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. డ్రాపౌట్స్‌లో ఎక్కువగా గిరిజన, దళిత చిన్నారులు ఉండడం బాధాకరమన్నారు. బడి ఈడు కలిగిన ప్రతి బాలుడు, బాలిక స్కూలులో ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, ఏపీసీ ఉషారాణి, ఎంపీడీవో ఎస్ఏ మహమ్మద్ రఫీ, మండల విద్యాశాఖ అధికారులు రేణుక, శోభనాద్రి, ప్రధానోపాధ్యాయులు సునంద, సనత్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, పులిపాటి వెంకటరత్నం పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీహెచ్‌సీని పరిశీలించి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యరంగ సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులకు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సూపరింటెండెంట్ ప్రసాద్, డాక్టర్ పద్మావతి, నరసింహారావు, కిరణ్, రిషితా, శ్రీకావ్య పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సాయంత్రం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత, గురుకుల పాఠశాల్లో ఈ ఏడాది జరిగిన పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి మోడల్స్, సర్టిఫికెట్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు యువత శ్రమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలోనే తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమం చేపట్టిన యూటీఎఫ్ సభ్యులను అభినందించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఆగిన పనులు పూర్తి చేస్తాం

● మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 : తాను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా 2014లో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఆగిపోయిన వాటిని పూర్తి చేస్తామని పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద గల నెక్లెస్ రోడ్డును అధికారుల తో కలిసి పరిశీలించారు. స్వర్ణాల చెరువు ఘాట్, నెక్లెస్ రోడ్డు మరమ్మతుల తోపాటు ఇరుకళల పరమేశ్వరి ఘాట్‌లో మరమ్మతులు చేసేందుకు ప్రణాళి కలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు చెరువులో గుర్రపు డెక్క తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నెక్లెస్ రోడ్డుకు విద్యుత్ దీపాలు, విగ్రహాలకు పెయింట్లు కూడా పూర్తి చేసి, స్వర్ణాల చెరువు ఘాట్, ఇరగాళమ్మ ఘాట్‌ను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నందిమండలం భానుశ్రీ, కొండా ప్రవీణ్‌శంకర్, తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ నగర్‌లో పర్యటన

నెల్లూరు రూరల్: నగరంలోని 4వ డివిజన్ దీన్‌యాళ్‌నగర్‌లో మంత్రి నారాయణ శుక్రవారం పర్యటించారు. ఇటీవల టీడీపీ ప్రభుత్వం అందించిన పింఛన్ల పంపిణీ తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు కొందరు తమకు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండ్లు కావాలని విజ్ఞప్తి చేశారు. మరికొందరు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నాయకులు తాళ్లపాక అనురాధ, విజేత, మామిడాల మధు, రాజానాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి నెల్లూరు చెరువును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

రొట్టెల పండుగపై ఎమ్మెల్యేతో చర్చలు

నెల్లూరు(వైద్యం): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం కలిశారు. బారాషహీద్ దర్గాలో త్వరలో జరగనున్న రొట్టెల పండుగపై చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ భానుశ్రీ, పలువురు కార్పొరేటర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. కాగా, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్‌తో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. అజీజ్ నివాసానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అజీజ్ సోదరుడు జలీల్, తాళ్లపాక అనూరాధ, ముప్పాళ్ల విజేత, నగర అధ్యక్షుడు మామిడాల మధు పాల్గొన్నారు.

కామాక్షితాయికి పల్లకీ సేవ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 5: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. ఉదయం ఆలయంలో గంగా,కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణం జరిపించారు.

నేడు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం

ఇందుకూరుపేట, జూలై 5 : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని ముదివర్తిపాలెం, జగదేవిపేట, మైపాడు, నరసాపురం, లేబూరు, ఇందుకూరుపేట ప్రాంతీయ పశు వైద్యశాలల్లో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు శనివారం ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు నేడు వేలం

మనుబోలు, జూలై 5: గ్రామంలోని కుడిచెరువు, కండలేరు కాలువలో చేపలు పట్టుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 5వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. వేలంపాట దక్కించుకున్నవారికి ఏడాది పాటు చేపలు పట్టుకునేందుకు హక్కు ఉంటుందని వివరించారు.

బోరు అనుమతులపై విచారణ



పత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, డీఎల్‌పీవో

మనుబోలు, జూలై 5: మండలంలోని జట్లకొండూరు సమీపంలోని ఎస్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బోరు వేసేందుకు ఇచ్చిన అనుమతులపై శుక్రవారం నెల్లూరు డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. కళాశాలకు ఇచ్చిన పంచాయతీ అనుమతులు సక్రమంగా లేవని, కళాశాలలో వేసిన బోరుకు వాల్టా చట్టం నిబంధనలు ఉల్లంఘించారంటూ, డిప్యూటేషన్‌పై కార్యదర్శులను ఎలా బదిలీ చేస్తారంటూ మేకల వంశీకృష్ణలు డీపీవోకు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాలతో విచారణకు వచ్చినట్లు తెలిపారు. అలాగే ఎంపీడీవో వెంకటేశ్వర్లుగా ఉన్న సమయంలో డిప్యుటేషన్ల ఫైళ్లను పరిశీలించి నివేదికలను డీఎల్‌పీవోకి అందించారు. రెండు ఫిర్యాదులకు సంబంధించిన నివేదికలను జిల్లా పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా నోడల్ అధికారి పీఎల్ దయాకర్

సైదాపురం, జూలై 5: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డివిజన్ ప్రోగ్రామ్, ఎఫ్‌టీసీ జిల్లా నోడల్ అధికారి పీఎల్ దయాకర్ శుక్రవారం తనిఖీ చేపట్టారు. వైద్య సిబ్బంది తీరుపై మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారని, డాక్టర్ శ్రావణి సరిగా వైద్య సేవలు అందించడం లేదని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. సిబ్బందిలో మార్పు రాకుంటే విధుల నుంచి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిస్టార్ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి



పోలీసు స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్

కోవూరు, జూలై 5: పెన్నా నది ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలించడంపై శుక్రవారం పోలీసులు దృష్టి పెట్టారు. జమ్మిపాళెం ఇసుకరీచ్ నుంచి ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు. గత కొద్దికాలంగా ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమార్కులు యధేచ్ఛగా ఇసుకను భారీ వాహనాల్లో తరలించారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

కలెక్టర్‌ను కలిసిన బుచ్చి కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 5: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఓ.ఆనంద్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో బుచ్చి నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చి నగర పంచాయతీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న బుచ్చి నగర పంచాయతీ కమిషనర్

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం



డీటీని సన్మానిస్తున్న వీఆర్‌వోలు

మనుబోలు, జూలై 5: డిప్యుటేషన్‌పై వెళుతున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఏడాదిన్నర కాలంగా శ్రీకాంత్‌రెడ్డి మనుబోలు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఆయన్ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పీఏగా వెళ్లాలని జిల్లా రెవెన్యూ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, వీఆర్‌వోలు మురళీధర్, నాగార్జునరెడ్డి, అఖిల్, శ్రీనువాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన జనసేన నేతలు

వెంకటాచలం, జూలై 5: నూతన శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన హరిప్రసాద్‌ను శుక్రవారం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా హరిప్రసాద్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని తదితరులున్నారు.



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న బొబ్బేపల్లి సురేష్ నాయుడు

కొమరిక పాల సొసైటీ అధ్యక్షుడిగా మనోహర్

ఇందుకూరుపేట, జూలై 5: మండలంలోని కొమరిక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘానికి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘంలో పది మంది డైరెక్టర్లు ఉండగా మెజార్టీ సభ్యులు మునగొట్టి మనోహర్‌కు మద్దతు పలకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

'డీకేడబ్ల్యూ'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 5 : నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో అడ్మిషన్‌కు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ ఈనెల 10వతేదీ వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీటెక్ (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) అనే కొత్త కోర్సును ఇంటర్‌లో డీఎంఎల్‌టీ, బైపీసీ చదివిన విద్యార్థులకు ప్రారంభించామని చెప్పారు. అలాగే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థినుల కోసం బీఎస్సీ (ఆనర్స్ డిగ్రీ)లో మ్యాథమ్యాటిక్స్, కెమిస్ట్రీ ప్రోగ్రామ్స్‌లో నాలుగో సంవత్సరం ఆనర్స్ డిగ్రీ ప్రారంభించామన్నారు. బీఏ(ఆనర్స్‌డిగ్రీ) విభాగంలో సాధారణ కోర్సులుగా హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్‌లను, ప్రత్యేక కోర్సులుగా స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీఎస్సీ(ఆనర్స్ డిగ్రీ)లో సాధారణ కోర్సులుగా మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ, మైక్రో బయాలజీ, హోమ్‌సైన్స్, కెమిస్ట్రీ ప్రోగ్రామ్స్, ప్రత్యేక కోర్సులుగా బయోటెక్నాలజీ, ఆక్వాకల్చర్, బీకామ్(ఆనర్స్‌డిగ్రీ)లో ప్రత్యేక కోర్సులుగా బీకామ్ జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్స్ ఉన్నాయన్నారు. పీజీ ప్రోగ్రామ్స్‌గా ఎంఏ(తెలుగు), ఎంఎస్సీ (జువాలజీ) అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్లు, ఇతర వివరాలకు ఫోన్ 8639734668 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగన్ పర్యటనతో కార్యకర్తల్లో ఉత్సాహం

● మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (విద్య), జులై 5 : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తే యంత్రాంగం కనీస భద్రత కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, తామంతా అండగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నేతలు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మహ్మద్ ఖలీల్, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 5 : కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో ఎస్టీ కోటా కింద రిజర్వ్ చేయబడిన సీట్లకు, నాలుగో తరగతి, ఏడో తరగతిలో ఓపెన్ కేటగిరి కింద మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 6 నుంచి విద్యాలయ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 16వతేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు అందచేయాలన్నారు. అడ్మిషన్ల కోసం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే కాకుండా ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు kothuru.kvs.ac.in వెబ్‌సైట్‌లోగానీ, విద్యాలయం కార్యాలయంలోగానీ సంప్రదించాలని కోరారు.

డిజిటల్ గ్రంథాలయానికి సహకారం: కలెక్టర్ ఆనంద్



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 : నగరంలోని పద్మభూషణ్ గుర్రం జాషువా గ్రంథాలయంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుకు సహకారం అందిస్తానని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జాషువా గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాసిం ఆధ్వర్యంలో గ్రంథాలయ కమిటీ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం కలెక్టర్‌కి గ్రంథాలయం ఏర్పాటు ఉద్దేశాలను వివరించారు. కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయం పునర్నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు సహకరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన కోవూరు ఎమ్మెల్యే

నెల్లూరు(హరనాథపురం), జూలై 5 : కలెక్టర్ ఆనంద్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించారు. కాగా, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య కూడా కలెక్టర్‌ను కలిసి సత్కరించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బీజేపీ, జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 5: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో బీజేపీ, జనసేన పార్టీల నాయకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కార్య దర్శి ప్రశాంత్, బీజేపీ కావలి మండల అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వరు, ప్రధాన కార్యదర్శి జరుగుమల్లి జయకుమార్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జనసేనాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని అందజేశారు. బీజేపీ నాయకులు జిల్లాలోని పలు సమస్యల గురించి చర్చించారు.

కావలి ఎమ్మెల్యే భేటీ..

కావలి, జూలై 5: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ. ఆనంద్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్ట్

● 16 వాహనాల స్వాధీనం



నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైం), జూలై 5: మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు నేరస్తులను దర్గామిట్ట, బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను శుక్రవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. వనంతోపు సెంటర్, నక్కలగుంట ప్రాంతానికి చెందిన దువ్వూరు రాజాను నిందితుడిగా నిర్ధారించి అతని కోసం కొంతకాలంగా గాలిస్తున్నారని, పద్మావతి గ్రీన్ సిటీ వద్ద అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన దువ్వూరు రాజా, దాసరి ప్రేమ్‌కుమార్‌తో కలిసి బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఏడు మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు అంగీకరించాడన్నారు. అయితే బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో మూడు మోటారు సైకిళ్ల చోరీ జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, మిగిలిన నాలుగు మోటారు సైకిళ్ల యజమానులు ఫిర్యాదు చేస్తే వారికి అందిస్తామని డీఎస్పీ తెలిపారు. మరో నిందితుడు ప్రేమ్‌కుమార్ కోసం గాలిస్తున్నామన్నారు. ఈ కేసుల్లో ప్రతిభ కనబరిచిన బాలాజీనగర్ ఎస్ఐ ఎస్‌కే మహబూబ్ సుభాని, హెడ్‌కానిస్టేబుళ్లు సీహెచ్ శివకుమార్, సీహెచ్ రమేష్, పీ వెంకటరావు, కానిస్టేబుల్ పీ పార్థసారధి, ఓవీఎస్ ప్రసాద్, తదితరులను అభినందించి రివార్డులు అందించారు.

తొమ్మిది మోటారు సైకిళ్ల స్వాధీనం

నగరంలోని దర్గామిట్ట పోలీసు స్టేషన్‌తోపాటు ఇందుకూరుపేట, బిట్రగుంట పోలీసు స్టేషన్లలో నమోదైన మోటారు సైకిళ్ల చోరీకి సంబంధించి నిందితుడిని దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను నగర డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి కోసం ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, సాంకేతికత ఆధారంగా మనుబోలు మండలం, పిడూరు గ్రామానికి చెందిన యల్లంటి మురళి ఉరఫ్ మురళీకృష్ణను నిందితుడిగా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఏడు కేసుల్లోని మోటారు సైకిళ్లతోపాటు ఆచూకీ తెలియని మరో రెండు మోటారు సైకిళ్లను అపహరించినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడన్నారు. అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3లక్షల విలువ చేసే తొమ్మిది మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన జనసేన నాయకులు



ఎమ్మెల్సీను సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), జూలై 5: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తరఫున శాసనమండలికి ఎన్నికైన పిడుగు హరిప్రసాద్‌ను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యాదర్శి సుందరరామిరెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జులు నలిశెట్టి శ్రీధర్, ఉయ్యాల ప్రవీణ్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య అధికారి గనిబాషా మృతికి సంతాపం

నెల్లూరు(వైద్యం), జూలై 5 : వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారి షేక్ గనిబాషా అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందటం బాధాకరమని ఆయన కుంటుంబానికి సంతాపం తెలుపుతున్నట్లు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకరరావు ఓ ప్రటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసిన గనిబాషా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ వైద్య సేవలు అందించారన్నారు. ఆయన మృతికి హంస జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నారాయణరాజు, కోశాధికరి మజురుల్లా, సుధాకర్‌రెడ్డి, గౌస్‌బాషా, తిరుపతిరావు సంతాపం తెలియచేశారు.

గుండెపోటుతో పెయింటర్ మృతి

నెల్లూరు(క్రైం), జూలై 5: గుండెపోటుతో పెయింటర్ మృతిచెందాడు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు మూలాపేట అలంకార్ సెంటర్‌కు చెందిన అప్పారావు(50), ధనలక్ష్మి దంపతులు. అప్పారావు పెయింట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా అప్పారావు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ రాత్రి కేవీఆర్ జంక్షన్ నుంచి ఇంటికి వెళుతుండగా గుండెపోటుకు గురయ్యారు. స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అప్పారావు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య దర్గామిట్ట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ప్రమాణ స్వీకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 : నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరుగుతుందని సమితి అధ్యక్ష, కార్యదర్శులు గుడ్లదొన వాసుదేవరావు, ఐ కామేశ్వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ఆర్టీసీ బస్టాండు వద్ద గల డీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని బ్రాహ్మణులు అందరూ తరలిరావాలని కోరారు.

రక్తదానం మహాదానం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 : రక్తదానం చేసి మరో నలుగురికి ప్రాణం పోయాలని పవన్‌యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకుడు కొగిలి రమేష్‌రాజ్, యువతకు పిలుపునిచ్చారు. నేవా బ్లడ్ బ్యాంకులో పవర్‌యూత్ స్వచ్ఛంద సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అశోక్ పుట్టిన రోజు సందర్భంగా అతని మిత్రులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మోపూరు రిషిత, ముని వెంకటసూర్య, యాశు, రాజా, సాయితేజ్ పాల్గొన్నారు.

ప్రజాపరిష్కార వేదిక సేవలు పేదలకు అందాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను త్వరితంగా పరిష్కరించి పేదలందరికీ న్యాయం చేయాలని నూతన కలెక్టర్ ఆనంద్‌ను న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య, ఏపీబీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, సాగర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్ కోరారు. కలెక్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది రాజ్‌కుమార్, బహుజన ప్రజా సంఘం కార్యదర్శి కోవూరు బాబూరావు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్



సభ్యత్వ నమోదులో ఎస్టీయూ నేతలు

నెల్లూరు (విద్య), జులై 5 : విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెం. 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పలు నగరపాలక పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు మునిసిపల్ పరిధిలోని 16 ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 40 ప్రాథమిక పాఠశాలల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అయితే తగినంత మంది ఉపాధ్యాయులులేరని, సుమారు 170 మంది ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. దీనిపై జిల్లా విద్యాశాఖ దృష్టి సారించి పనిసర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, సుమన్, వెంకటసుబ్బయ్య, వెంకటరత్నం, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

టూరిజం హబ్‌గా తిరుపతి

మంత్రి కందుల దుర్గేశ్

చంద్రగిరి/తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హోటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టూడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్.రోప్‌వే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హోటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



పర్యాటక శాఖ అధికారులతో మంత్రి దుర్గేశ్ సమీక్ష



ముక్కంటి సన్నిధిలో

అమరావతి రైతులు

శ్రీకాళహస్తి, జూలై 5 : అమరావతి రైతులు . శుక్రవారం ముక్కంటీశుడిని దర్శించుకున్నారు. ఆలయంలోని పొగడచెట్టు వద్ద కాసేపు శివనామ స్మరణ చేశారు.రాజధానిగా అమరావతే వుండాలంటూ 2021వ సంవత్సరం డిసెంబరు నెలలో 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' నినాదంతో అమరావతి రైతులు పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు.ఎన్నికల్లో చంద్రబాబు గెలుపుతో రాజధానిగా అమరావతే వుండాలన్న తమ సంకల్పం సఫలీకృతం కావడంతో ముక్కంటి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారిని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి తమ ఇంటికి ఆహ్వానించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని బొజ్జల స్వగృహంలో రాజధాని రైతులు శుక్రవారం రాత్రి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ గత సీఎం జగన్ తమను దారుణంగా వేధించారని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాదయాత్ర జరిగిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి తమ పట్ల అమానుషంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అకార ణంగా అక్రమం కేసులు బనాయించారని చెప్పారు. పాదయాత్రలో భాగంగా బస చేసేందుకు అవకాశం ఇచ్చిన వారిని కూడా వెంటాడి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు.అప్పట్లో బొజ్జల కుటుంబంతో పాటు టీడీపీ నేతలు ఎంతగానో సహకరించారన్నారు. అనంతరం మహిళా రైతులను బొజ్జల రిషితారెడ్డి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి పసుపు, కుంకుమ, చీరసారె అందజేశారు. మగవారికి పంచె, కండువా సమర్పించారు. టీడీపీ నాయకుడు మునిరాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న

విజిలెన్స్ తనిఖీలు

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిరుమలలో తనిఖీలు కొనసాగిస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన క్రమంలో రెండువారాలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టీటీడీలోని పలు విభాగాల్లో సోదాలు చేస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, బదిలీపై వెళ్లిన అధికారులు, వారి వివరాలను సేకరించడంతో పాటు నిధులను ఎక్కడ, ఎలా వినియోగించారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. తాజాగా, గురువారం ఎస్టేట్ విభాగంతో పాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించే ఈవో కార్యాలయంలోనూ సోదాలు చేసినట్టు సమాచారం. ఈవో కార్యాలయంలోని ఇద్దరు ముఖ్యమైన అధికారులను ప్రశ్నించి స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిసింది. వీఐపీ బ్రేక్ టికెట్లు ఎలా కేటాయిస్తున్నారు, ఎవరికి కేటాయిస్తున్నారు, కేటాయింపుల్లో ఏమైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో విచారించినట్టు తెలిసింది. ఇక, తిరుపతిలోనూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో శుక్రవారం సోదాలు చేసి పలు రికార్డులు తీసుకున్నట్టు సమాచారం.మరో రెండుమూడువారాల పాటు సోదాలు జరగనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ ఫైళ్ల దహనం..!

పుంగనూరు ఎంపీడీవో కార్యాలయ రికార్డులుగా అనుమానం

పుంగనూరు, జూలై 5: చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శ్మశానం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ రికార్డులు దహనమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయానికి చెందిన రికార్డులను సంచిలో వేసుకొని రహస్యంగా కాల్చి బూడిదచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎంపీడీవో కార్యాలయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన రికార్డులు చేరిపేయాలనే ఈ చర్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పాలనలో ఏదైనా అక్రమాలు జరిగిఉంటే టీడీపీ ప్రభుత్వంలో వెలికి తీస్తారనే భయంతో ఉపాధిహామీ ఇతరశాఖల రికార్డులు కాల్చివేశారా అనే ప్రచారం జరుగుతోంది.

- చేరికలతో పాతికమందికి పెరిగిన కూటమి బలం
- ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్యేలు
- కౌన్సిల్‌లో స్పష్టమైన మెజారిటీ

టీడీపీ ఖాతాలోకి చిత్తూరు కార్పొరేషన్

చిత్తూరు సిటీ, జూలై 5: చిత్తూరు నగరపాలక సంస్థ కూటమి ఖాతాలో చేరింది. శుక్రవారం నాటి చేరికలతో కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వీరిలో మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేష్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, అసంతృప్తులతో పాటు అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న భావనతో పలువురు పార్టీ మారారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 50 డివిజన్లు ఉండగా.. అప్పట్లో 37 చోట్ల వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకుంది. మిగిలిన వాటికి ఎన్నికలు జరగ్గా.. 3 చోట్ల టీడీపీ గెలిచింది. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో వీరి బలం 21కి పెరిగింది. కొన్నాళ్ల కిందట నలుగురు జనసేనలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమికి 25 మంది సభ్యులయ్యారు. వీరికి తోడు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా చేరడంతో ఆ సంఖ్య 27కి చేరింది. ఇంకా కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, చేరికల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, నగర అభివృద్ధి కోసం మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, అశోక్, కంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే గురజాల

ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దుతాం

అందరి సహకారంతో చిత్తూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయరు అముద తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వేలూరు, తిరుపతికి దీటుగా చిత్తూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీనికోసం ఎమ్మెల్యే వద్ద మాస్టర్ ప్లాన్ ఉందన్నారు.

టీడీపీలో చేరిన కార్పొరేటర్లు వీరే

మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్ కుమార్ రెడ్డి, డివిజన్ల వారీగా కార్పొరేటర్లు.. పి.నవీన్ కుమార్(2వ) బి.అజర్ భాను (6వ), డి.కె.సుమతి (10వ), ఎం.శాంతి (18వ), పి.గంగ (22వ),ఇ.ఇందు (27వ), టి.ప్రభావతి (28వ), ఎస్.సుష్మ (30వ), సయ్యద్ సర్దార్ (31వ), ఎస్.ఉన్నికృష్ణ (38వ), పి.గణేష్, (40వ), కుప్పమ్మ (41వ), ఆర్.శశికుమార్ (42వ), పి.వెంకటరమణ (43వ), ఎస్.రెడ్డెప్ప (46వ), ఏజీ సహదేవన్ (50వ డివిజన్).

22 మంది కార్పొరేటర్ల సస్పెన్షన్

చిత్తూరు: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ 22 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కో- ఆప్షన్ సభ్యులను సస్పెండు చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు భరత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు కొంత మంది కార్పొరేటర్లు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా ఎన్నికల సమయంలో చర్యలు తీసుకోకూడదని పార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మేయరు, డిప్యూటీ మేయరు సహా 18 మంది కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరిపోయారు. గతంలో నలుగురు జనసేనలో చేరిన విషయం తెలిసిందే.

ఏడు కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయి సహా నిందితులతో సెబ్ సిబ్బంది

నాయుడుపేట టౌన్, జూలై 5: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. సెబ్ కార్యాలయంలో శుక్రవారం పట్టుబడ్డ గంజాయి సహా నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. పట్టణ పరిధిలోని జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. గుడివాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా 7.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గంజాయిని తమిళనాడుకు చెందిన ఇళవరసన్, కవిన్, ఆకాష్ తరలిస్తున్నట్లు తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా ముగ్గురికి 19వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

బేల్దారి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తడ, జూలై 5: బేల్దారి మృతి చెందడంపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కోటిచెరువు గ్రామానికి చెందిన కాయల మధుబాబు (40) కుటుంబసభ్యులతో విబేధించి రెండేళ్ల క్రితం అక్కంపేటకు వచ్చి బేల్దారి పనులు చేసుకుంటూ ఇక్కడే ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉండటంతోపాటు విపరీతంగా అరుస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అరిచి కిందపడిపోయాడు. చుట్టుపక్కలవారు మద్యంతాగి అరుస్తూ కిందపడిపోయి ఉంటాడని భావించి అలాగే వదిలేశారు. కొంత సమయం తరువాత కూడా అలాగే పడిఉండటంతో చుట్టుపక్కల వారు అతనిని పరిశీలించి 108 అంబులెన్స్‌ను పిలిపించి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు శుక్రవారం మృతదేహాన్ని పరిశీలించి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, జూలై 5: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జూన్ 25వ తేదీ నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో 108 వాహనం ద్వారా ఓ వ్యక్తి ఆ మహిళను చేర్పించాడు. మహిళను ప్రాథమిక చికిత్సల అనంతరం గూడూరుకు తరలించారు. అదే రోజు సాయంత్రం అక్కడి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 26వ తేదీ మృతి చెందడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆ మహిళ దగ్గర ఉన్న ఆధారాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన పఠాన్‌బీగా గుర్తించారు.

మున్సిపల్ రోడ్డు ఆక్రమణపై నోటీసులు



నాయుడుపేట, జూలై 5: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యా లయం ఎదుట మున్సిపల్ రోడ్డును ఆక్రమించి రేకుల షెడ్లను తొలగించాల్సిందిగా మున్సిపల్ అధికారులు నోటీసులు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు ఆక్రమణలను తొలగించాలని లేకపోతే మున్సిపల్ సిబ్బంది స్వయంగా చర్యలు తీసుకుంటారన్నారు. దానికైన ఖర్చులు భరించాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

చెంగాళమ్మ సేవలో చీరాల ఎమ్మెల్యే



కొండయ్యకు ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జూలై 5: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరిని శుక్రవారం చీరాల ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల గ్రూపు సంస్థల చైర్మన్ బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



వాషింగ్ మెషిన్‌ను అందిస్తున్న లయన్‌క్లబ్ సభ్యులు

గూడూరు, జూలై 5: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విస్తృ తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలసదనంలో విద్యార్థులు దుస్తులు శుభ్రపరుచుకునేందుకు వాషింగ్ మెషిన్‌ను అందించారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, పేదలకు వైద్యసేవలు అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిల్లకూరు మండలం ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫయ్యర్ అందజేశామన్నారు. రవిచంద్ర, రవికుమార్, శివయ్య, వీరేంద్రనాథ్, మురళీరెడ్డి, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

వెంకటగిరి టౌన్, జూలై 5: మండల సర్వసభ్య సమావేశం జూలై 10న ఎంపీపీ టి.తనూజా అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నీలకంఠశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నేటినుంచి జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

నాయుడుపేట టౌన్, జూలై 5 : నాయుడుపేటలోని షాదీమందిర్‌లో జూలై 6, 7 తేదీలలో ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయిలో తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నట్లు తైక్వాండో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తెలిపారు.

9న తోటల ఫలసాయం వేలం

వెంకటగిరి, జూలై 5: స్థానిక పెరియవరం సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9వ తేదీన తోటల ఫలసాయం వేలం నిర్వహించనున్నట్లు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గోవిందరాజులు శుక్రవారం పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిమ్మ, చీనీ, సపోటా తోటల ఫలసాయంపై వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల లోపు పండ్ల తోటలను పరిశీలించవచ్చన్నారు. వివరాలకు నెం.8985461284లో సంప్రదించవచ్చని గోవిందరాజులు తెలిపారు.

ఈసారైనా డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యేనా?

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా గోషా ఆసుపత్రి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 5: శతాబ్దం చరిత్ర కలిగిన పట్టణంలోని గోషా ఆసుపత్రి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మద్యం బాబులు రాత్రి పూట ఇక్కడ వీరంగం సృష్టిస్తుండడంతో చుట్టు పక్కల నివాసాలు ఉంటున్న వారు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా మద్యం సీసాలను పగల గొట్టి నానా బీభత్సం చేస్తున్నారు. ఆసుపత్రి చుట్టు పక్కల పలు కాలేజీలు, పాఠశాలలున్నాయి. చిన్నారులు ఆడుకుందుకే వచ్చి సీసా పెంకులు గుచ్చుకుని ఆసుపత్రి పాలు అవుతున్నారు. టీడీపీ ప్రభుత్వం కొలువు దీరిన క్రమంలో గతంలో ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారన్న హామీపై ఆశలు చిగురిస్తున్నాయి.

1920లో ప్రారంభమైన ఆస్పత్రి 2006వ సంవత్సరం వరకు సేవలందించింది. 2006లో అప్పటి ప్రభుత్వ హయాంలో బంగారుపేట పీహెచ్‌సీ పేరిట గోషా ఆస్పత్రిలోనే రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి అత్యవసర మాతా ప్రసూతి శిశు సంరక్షణ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. 2011లో వెంకటగిరి సీహెచ్‌సీకి అర కిలోమీటరు పరిధిలో గోషా ఆసుపతి ఉందని దాన్ని మార్చాలని జీవో రావడంతో ఆసుపత్రిని బంగారుపేట పీహెచ్‌సీగా 2014 భవనం ప్రారంభించారు. 2016లో గోషా ఆసుపత్రి నుంచి బంగారుపేటకు పూర్తిగా మార్చేశారు. 2016లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ గోషా ఆసుపత్రిని పరిశీలించి పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈక్రమంలో 2018లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అపోలో ఆసుపత్రి నిర్వాహకులను ఇక్కడికి తీసుకువచ్చి గోషా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కృషి చేశారు. అనివార్య కారణాల వల్ల కేంద్రం ప్రారంభం కాలేదు. తరువాత ప్రభుత్వం మారడంతో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా పరిశీలించి వంద పడకల ఆసుపత్రికి కృషి చేస్తామని చెప్పారు. అయితే కార్యరూపం దాల్చలేదు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని చెప్పారు. దీంతో పట్టణ ప్రజలకు ఆసుపత్రిపై ఆశలు చిగురించాయి. వెంకటగిరి నుంచి తిరుపతికి ఎంతో మంది డయాలసిస్ బాధితులు వెళ్తున్నారు. టీడీపీ ప్రభుత్వం రావడం అందునా ఎమ్మెల్యేగా కురుగొండ్ల విజయం సాధించడంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తారని మండలవాసులు ఎదురు చూస్తున్నారు.





గోషా ఆసుపత్రిలో మద్యం బాటిళ్లు, చెత్తాచెదారం

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం: విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 5: ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి సూళ్లూరుపేట మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా మని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల సహకారంతో పట్టణ అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు కాకుండా ప్రభుత్వ నిధులతో సూళ్లూరుపేటను తీర్చిదిద్దుతానన్నారు. అవసరమైతే షార్ సహకారంతో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయిస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రతి ఇంటికీ నీరందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తిచేసి త్వరిత గతిన లబ్ధిదారులకు ఇవ్వాలని అధికారులను ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. అంతకుముందు మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, బీసీ సెల్ నాయకుడు పెరుమాల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

జీవో 117ని రద్దు చేయండి

సూళ్లూరుపేట/ కోట/ నాయుడుపేట, జూలై 5: విద్యా విధానంలో తీసుకొచ్చిన జీవో 117ను వెంటనే రద్దు చేసి 3, 4, 5 తరగతులను హైస్కూల్ విలీనం నుంచి వెనక్కి తీసుకొచ్చి యథావిధిగా కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు శేఖర్ అన్నారు. ఫేడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తికావడంతో మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును తాజ్‌పెట్రోల్ బంకు సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవాల నేపథ్యంతో మండల స్థాయి సభ్యుడు పాల్గొనే చైతన్యం తీసుకురావాలన్నారు. కొన్ని మార్పులు తీసుకొచ్చి పాత పద్ధతిని కొనసాగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రామ్మూర్తి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని కొండుగుంట, చిట్టేడు, గూడలి, మద్దాలి, సిద్ధమ్మకండ్రిగ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం బీటీఏ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువగళం పాదయాత్ర సందర్భంగా జీవో 117ను రద్దు చేయాలని మాజీ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆ జీవోను రద్దుచేసి ఉపాధ్యాయులకు భరోసా ఇవ్వాలని కోరారు. బీటీఏ మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ విధి విధానాలతో ప్రాథమిక విద్యా వ్యవస్థ చిన్నభిన్నం అయ్యిందని, జీవో 117ను రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. నాయుడుపేట పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటరావు , లక్ష్మీప్రసాద్, బి.బాబు తదితరులు పాల్గొన్నారు.



కొండుగుంట పాఠశాలలో బీటీఏ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు





నిరుపయోగంగా ఉన్న కొండూరు సంపద తయారీ కేంద్రం - మంగళంపాడు వద్ద రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

సూళ్లూరుపేట, జూలై 5: లక్ష్యం నీరుగారింది.. చెత్తను ఆదాయ వనరుగా మార్చి పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో గతంలో పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. స్వచ్ఛభారత్ తోపాటు ఉపాధిహామీ పథకం నిధులను వీటి నిర్మాణానికి వినియోగించారు. ఇవి ఎలా పనిచేయాలనే విషయంపై ముందస్తు ప్రణాళికతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చారు. ఇంత చేసినా క్షేత్రస్థాయిలో ఇవి ఎక్కడా పనిచేయడం లేదు. వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా రైతులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టాలన్న ఆశయమూ నెరవేరలేదు. ఐదేళ్ల నుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

14 కేంద్రాలూ నిరుపయోగం...

సూళ్లూరుపేట మండలంలో మొత్తం 19 పంచాయతీలకు గాను 14 సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఒక్కో కేంద్ర నిర్మాణానికి రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెచ్చించారు. అప్పట్లోనే పంచాయతీల్లో, పొడి, తడి చెత్తను సేకరించేందుకు హరిత రాయబారులను నియమించారు. కొన్ని చోట్ల ఆరంభంలో బాగానే జరిగింది. వారికి జీతాలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెల్లింపులు జరిగాయి.

నిర్వహణ గాలికి...

2019లో ప్రభుత్వం మారిన తర్వాత వీటి నిర్వహణను గాలికొదిలేశారు. ఆదాయం సంగతి పక్కన పెడితే పలుచోట్ల ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కొన్నాళ్లు హరిత రాయబారులకు జీతాలు చెల్లించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అనంతరం పంచాయతీలే చెల్లించుకోవాలని చేతులు దులుపుకుంది.

నిధుల పక్కదారి...

గత ప్రభుత్వం ఆర్థిక సంఘ నిధులను పక్కదారి మళ్లించడంతో పంచాయతీల్లో కనీస సౌకర్యాల కల్పన కష్టమైంది. దీంతో తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యం మూలకు చేరింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తెస్తారని ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వీటిని ఆచరణలోకి తెస్తే రైతులకు కూడా ఎంతో ఉపయోగంగా ఉండటమే కాకుండా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుంది.

జామాయిల్ చెట్లపై గొడ్డలి పోటు

సంగనపల్లి, పాతనాలపాడు, కొత్తపల్లి ప్లాంటేషన్ల నుంచి స్మగ్లింగ్

డక్కిలి, జూలై 5: అటవీ ప్లాంటేషన్లలో జామాయిల్ చెట్లు నరికి అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని పాతనాలపాడు, సంగనపల్లి, కొత్తపల్లి పరిధిలో సుమారు వెయ్యి హెక్టార్లలో అటవీ శాఖ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి జామాయిల్ చెట్లను పెంచింది. కొందరు అక్రమార్కులు రాత్రి వేళల్లో వాటిని యథేచ్ఛగా నరికించి తరలించుకుపోతున్నా అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంగనపల్లి సమీపంలోని ఓ ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లు ముక్కలు ముక్కలుగా నరికి వేసి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించారు. కొంతమంది ఎండుకట్టెల మాటున జామాయిల్ దుంగలను తరలిస్తుండగా మరి కొందరు రాత్రి వేళల్లో చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా శ్రీకాళహస్తికి చేరుస్తున్నారు. గత నెల రోజులుగా ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అదేవిధంగా దేవునివెల్లంపల్లిలోని జామాయిల్ ప్లాంటేషన్లలో ఎక్కువ భాగం చెట్లను నరికి తరలించడంతో అక్కడ చెట్లు కంటే నరికేసిన మొదళ్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అటవీ ప్లాంటేషన్లలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తరలించడానికి సిద్ధంగా ఉన్న జామాయిల్ దుంగలు

కలెక్టరును కలిసిన జేఏసీ నాయకులు



దొరవారిసత్రం, జూలై 5: తిరుపతి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా జేఏసీ చైర్మన్ పి.గోపినాథ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్వర్, కోశాధికారి రూప్‌చంద్, జీవన్ తదితరులు ఉన్నారు.

కోటమ్మకు సామూహిక పొంగళ్లు

కోట, జూలై 5: పట్టణంలోని కోటమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన భక్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. అమ్మవారి ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు మల్లెపూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

13న జగన్నాథ రథయాత్ర



కరపత్రాల ఆవిష్కరణలో ఇస్కాన్ ప్రతినిధులు

గూడూరు, జూలై 5: పట్టణంలో ఈనెల 13న నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో 10వ జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ప్రచార కేంద్ర నిర్వాహకుడు డాక్టర్ శుక దేవస్వామి చెప్పారు. శుక్రవారం సొసైటీ కాలనీలోని ఇస్కాన్ కేంద్రంలో రథయాత్రకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో పదేళ్లుగా పూరి తరహాలో రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐసీఎస్ రోడ్డు నుంచి ప్రారంభమై డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు వద్ద ముగుస్తుందన్నారు. రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. భానుప్రకాష్, డీపీఎస్ గిరి, రమణారెడ్డి, శేషయ్య, మయూరి శ్యామ్‌యాదవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, జూలై 5: పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. శుక్రవారం టీడీపీ నాయకుడు తానంకి నానాజీ నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పలు పరిశ్రమల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిశ్రమ ప్రతినిధులు స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో నియోజకవర్గంలో వెనుబడి ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడం, వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు



సూళ్లూరుపేట, జూలై 5: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది టెన్త్‌లో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ఇం దులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో 500 మార్కులు పైగా సాధించిన ఎల్.అజేయ్, జయంతి, ఏ.పవన్, వి.చందన, జి.లహరికి నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలను అం దజేశారు. సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఏ.అశోక్‌కుమార్ సమా పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 5: పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. డాక్టర్ రోహిణి మాట్లా డుతూ... ప్రతినెలా దివ్యాంగులకు చేయూత అంది స్తామన్నారు. విష్ణువం దన, తనూజ, అనిత, స్నేహలత, శశిరేఖ, జానా సుధీర్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సప్లై ఛానల్‌ను పునరుద్ధరించండి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పెళ్లకూరు, జూలై 5: మండలంలోని జీలపాటూరు చెరువుకు స్వర్ణముఖి, తెలుగుగంగ ద్వారా నీరందించే సప్లై ఛానల్‌ను పునరుద్ధరించాలని సర్పంచు కె.శివకుమార్, ఆయకట్టు సంఘ చైర్మన్ ఏ.రమణయ్య సహా రైతులు జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, ఎన్‌హెచ్ఏఐ అధికారి వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పెళ్లకూరు పెట్రోల్ బంకు, చిల్లకూరు, వడ్డిపాలెం వద్ద సప్లై ఛానల్‌ను పూడ్చి వేశారన్నారు. వర్షాలు ప్రారంభం కావడం వలన సప్లై ఛానల్ ద్వారా చెరువుకు నీరందడం లేదని వాపోయారు. ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాలు సాగవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి సప్లై ఛానల్‌ను పునరద్ధరించాలని కోరారు.

'నేను బడికి వెళ్తా' ర్యాలీ

దొరవారిసత్రం, జూలై 5: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేను బడికి వెళాత కార్యక్రమంపై అవగాహన కల్పించే దిశగా మండలంలోని సింగనాల త్తూరులో శుక్రవారం ర్యాలీ జరిగింది. ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మండల విద్యాశాఖాధికారులు మునిశేఖర్, కృష్ణయ్య ర్యాలీ చేపట్టారు. అలాగే విద్యార్థుల చేరిక, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సూళ్లూరుపేట, జూలై 5: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎల్‌పీవో సీహెచ్ రవీంద్రకుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని సామంతమల్లాంలో సిబ్బందితో కలిసి గ్రామ పరిసరాలతో పాటు నీటి ట్యాంకులను పరిశీలించారు. నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పకుండా చేయాలని, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, అతిసారంపై ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.